క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రామసముద్రం: మండల కేంద్రంలోని దిగుపేటలో వెలసిన శ్రీ చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆడి కృత్తిక మహోత్సవం సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి కన్నులపండువగా నిర్వహించారు. వేద పండితులు వేదమంత్రోచ్చారణతో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణోత్సవం తిలకించారు. భక్తులకు ఆలయ అర్చకులు బాలస్వామి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



పూజలందుకుంటున్న యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగుళూరురోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాసశివరాత్రి, స్వామి జన్మనక్షత్రం ఆరుద్ర కలిసి రావడంతో ఆలాయంలో స్వామికి రుద్రాభిషేకం చేశారు. స్వామి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ మహాన్యాసపూర్వక ఏకదశవార అభిషేకాలు చేశారు. స్థానిక దేవళంవీధిలో సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాషేకం నిర్వహించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: అరుద్ర నక్షత్రం సందర్భంగా స్థానిక శివాలయం సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన శివ, పార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఖన్నాస్వామి, మణికంఠ స్వామి, మంజునాథ్‌స్వామి, వెంకట సుబ్రహ్మణ్యం స్వామి విగ్రహ ప్రతిమలకు సుందర పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు, ఏకవార రుద్రాభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా బ్రాడ్‌కాస్టింగ్ డే



విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ రాయుడు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం బ్రాడ్ కాస్టింగ్ డే నిర్వహించారు. ఈసీఈ శాఖ ఆధ్వర్యంలో బ్రాడ్‌కాస్టింగ్ సాంకేతికత అభివృద్ధి అనే అంశంపై పోస్టర్ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు బ్రాడ్ కాస్టింగ్ ప్రారంభ దశల నుంచి ప్రారంభించి, డిజిటల్ స్ట్రీమింగ్, 5 జీ ఇంటిగ్రేషన కృత్రిమ మేధస్సుతో నడిచే మీడియా డెలివరీ వంటి ఆధునికత అభివృద్ధి వరకు వివిధ అంశాలపై పోస్టర్లు ప్రదర్శించారు. ఈ పోస్టర్లను అధ్యాపక బృందం సృజనాత్మకత, సాంకేతికత వంటి ప్రమాణాలపై మూల్యాంకనం చేశారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు, ఈసీఈ హెడ్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

రైతులను ఆదుకోండి

రామసముద్రం: అన్నదాతా సుఖీభవ ద్వారా రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు ఇవ్వాలని అఖిలభారత కూలి సంఘం అధ్యక్షుడు నాగప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలలో జమ చేయాలని కోరారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతుందన్నారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కలిప్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఆదుకోవాలని కోరారు.

గురుకులానికి ఫ్యాన్ల వితరణ

బి.కొత్తకోట: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయానికి తహసీల్దార్ బావాజాన్ నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందించారు. గత వారం విద్యాలయాన్ని తనిఖీ చేసిన సందర్భంగా విద్యార్థులు ఫ్యాన్లు కావాలని కోరడంతో బుధవారం తనిఖీ కోసం వెళ్లిన ఆయన సర్వేయర్ ముబారక్‌తో కలిసి వీటిని ఉపాధ్యాయులకు అందించారు.

కలసికట్టుగా కూటమి మోసాన్ని ఎండగడదాం!

- అబద్ధాలు, హామీల్లో చంద్రబాబు దిట్ట
- ఇప్పుడు ఎన్నికలొస్తే వైఎస్సార్‌సీపీకి 130 స్థానాలు
- ఎంపీ మిథున్‌రెడ్డిపై ముమ్మాటికి తప్పుడు కేసే
- మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, నేతలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, పక్కన తిప్పారెడ్డి, నిసార్ అహ్మద్, అనీషారెడ్డి, షమీంఅస్లాం, మనూజ



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు, ప్రజాప్రతినిధులు

మదనపల్లె: అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబును వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తల సమన్వయంతో కలిసికట్టుగా ఎండగడదామంటూ మదనపల్లె నియోజకవర్గ పార్టీ ముఖ్యనేతలు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక దేశాయ్ ఫంక్షన్ హాలులో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంపై మున్సిపాలిటీ, మదనపల్లె రూరల్ వైఎస్సార్‌సీపీ సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టించి పంచుతానని చెప్పిన చంద్రబాబు తన సంపద పెంచుకుంటున్నారని విమర్శించారు. తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ, అనంతపురం పార్లమెంటు పరిశీలకులు బి.నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధాలతో అధికారంలోకి రావడంలో చంద్రబాబును మించిన వారు లేరన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో హామీలను అమలు చేస్తే.. చంద్రబాబు ఎందుకు చేయడం లేదో ప్రజలే నిలదీయాలన్నారు. జగన్ హయాంలో పథకాలతో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో లెక్కలతో ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కక్ష సాధింపేనని అన్నారు. జగన్ హయాంలో బెల్టు షాపులు లేకుండా చేశారని, ప్రభుత్వం ద్వారానే మద్యం విక్రయించారని తెలిపారు. పార్టీలో మిథున్‌రెడ్డి కీలకమైన ముఖ్యపాత్ర పోషిస్తున్నందు వల్లె చంద్రబాబు టార్గెట్ చేసి అక్రమ కేసులో అరెస్ట్ చేయించారని ఆరోపించారు.

ఆర్థికంగా నష్టపోయిన ప్రజలు

సమన్వయకర్త నిసార్ అహ్మద్ మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డిపై కక్షతో అరెస్ట్ చేశారన్నారు. మోసాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. హామీలను విస్మరించి పాలన సాగిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వంతో పేదలు ఆర్థికంగా నష్టపోయారన్నారు. రాజంపేట పరిశీలకులు ఎస్.అనీషారెడ్డి, పార్టీ నాయకులు ఎస్.శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు ఎన్నికలొస్తే వైఎస్సార్‌సీపీ 130 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ అమలు చేయని ప్రభుత్వం రైతులు, మహిళలు, మైనార్టీలకు ఇచ్చిన హామీలు, 50 ఏళ్లకే పింఛన్, ఆడబిడ్డ పథకాలు అమలు చేస్తుందా అని నిలదీశారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీం అస్లాం మాట్లాడుతూ పార్టీ శ్రేణులతో తరచూ సమావేశాలు నిర్వహించి సమన్వయం పెంచేలా నేతలు చొరవ చూపాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టో ప్రతిఇంటికి తీసుకెళ్లి వివరించాలని కోరారు. మిథున్‌రెడ్డి అరెస్ట్ చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో భయం కలిగించేందుకు చూస్తున్నారని భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వరపన మనూజ మాట్లాడుతూ పింఛన్ల పెంపు తప్ప ఏ హామీనైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. పార్టీ పటిష్టతకు, కార్యక్రమాల నిర్వహణపై నాయకులు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. అనంతరం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను కార్యకర్తలతో కలిసి నాయకులు ఆవిష్కరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ నూర్ ఆజం, కౌన్సిలర్లు ఖాజా హుసేన్, శ్రీనివాసులు, రమేష్, గంగాధర్‌రెడ్డి, గుండ్లూరు రఫీ, రమణ, బాల గంగాధర్‌రెడ్డి, ఈశ్వరయ్య, శేఖర్, షేక్ ఇర్ఫాన్, ప్రసాద్, ఎస్.ఇర్ఫాన్, ఎస్‌ఏ.కరీముల్లా, బీరంగి రేవతి, వీఎస్.రెడ్డి, నరసింహారెడ్డి, నాగరాజరెడ్డి, బుడ్డయ్య, కత్తిరాజు, బావాజాన్, శరత్, వినుతబాయి, బషిరి, అమ్మాజాన్, మేరీ, నాగమణీ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

నిమ్మనపల్లె : మండలంలోని రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌ను బుధవారం మండలస్థాయి అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. తహసీల్దార్ తపస్విని, ఎంపీడీఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు మోడల్ స్కూల్‌కు వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ అందుబాటులో ఉండాలని విద్యార్థులు చెప్పారు. భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు.

క్రమశిక్షణతో చదవాలి

బి.కొత్తకోట: విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నతస్థానాలకు వెళ్తారని కమిషనర్ జీవీ పల్లవి, ఎంపీడీఓ కృష్ణవేణి అన్నారు. బుధవారం వారు స్థానిక ఆదర్శ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుబాటులోని సౌకర్యాలు, అందిస్తున్న విద్య, మధ్యాహ్న భోజన నాణ్యత, హాస్టల్ వసతులను పరిశీలించారు. విద్యార్థులతోవారు మాట్లాడుతూ చదువుకునే సమయంలో ఇతర విషయాలపై ఆసక్తి చూపకూడదన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

కేవీపల్లె : కోడిపందెరాయుళ్ల అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 4,200 నగదు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. బుధవారం మండలంలోని వడ్లకుంట పంచాయతీ మంచాలమంద వద్ద కోడిపందెం ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. నలుగురు కోడిపందెం రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు, కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అధికారుల తీరు మారాల్సిందే

మండల్‌మీట్‌లో సభ్యుల అసహనం



మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం: మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల పనితీరుపై ప్రజా ప్రతినిధులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారుల తీరు మార్చుకోవాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన జరిగిన మండల్‌మీట్‌లో పలువురు ఎంపీడీవో వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంభందించి బిల్లులు మంజూరు చేయకపోవడంతో తాను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కింది స్థాయి అధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారని బూర్లపల్లి సర్పంచ్ సుబ్బిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం సర్పంచ్ జీతాలు, పారిశుధ్య నిర్వహణ బిల్లుల కోసం నెలల తరబడి తిరుగుతున్నా ఎంపీడీవో నియంతలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో అధికారిక సమావేశాలు జరిగినా అధికారులు కనీస సమాచారం ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ద్వారా ఇంకుడు గుంతలు తవ్వించినా, మొక్కలు నాటినా కూడా బిల్లులు మంజూరు కాలేదని, అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన కోడి గుడ్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. హౌసింగ్ కాలనీల్లో పైప్‌లైన్, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, టమాటా కూలీల అవసరాలను గుర్తించి ములకలచెరువులో రాత్రి 8-30 గంటలకు బి.కొత్తకోట వైపు బస్సు నడిపేలా చొరవ చూపాలని కోరారు. పలు చోట్ల కొత్తగా తాగునీటి బోర్లు డ్రిల్లింగ్ చేయించాలని సభ్యులు సభా దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ కీలకమైన శాఖల అధికారులు మండల్‌మీట్‌కు రానప్పుడు సమావేశాలెందుకు నిర్వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరయిన అధికారులకు నోటీసులు పంపాలని ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. జెడ్పీటీసీ ఉంగరాల శివన్న మాట్లాడుతూ అధికారులు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని సూచించారు. వైస్ ఎంపీపీ పట్టిరిక శోభా, కోఆప్షన్ ఖాదర్ వలితో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శక్తియాప్‌తో మహిళలకు రక్షణ

మదనపల్లె రూరల్ : శక్తియాప్ మహిళలకు రక్షణగా నిలుస్తోందని శక్తి పోలీస్ బృందం సభ్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని కోటబడి హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి ఆదేశాలతో శక్తి టీం సభ్యులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి టీం సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలతో పాటు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. శక్తియాప్ ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా యాప్ ద్వారా మెసేజ్ పంపిన వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుంటారన్నారు. ప్రిన్సిపాల్ రవికుమార్, శక్తిటీం సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శక్తి టీం సభ్యులు

సమాచార చట్టంపై అవగాహన అవసరం



కలికిరి: రైతులతో మాట్లాడుతున్న ఏఓ హేమలత



కేవీపల్లె : అవగాహన కల్పిస్తున్న ఏఓ మాధవి

కలికిరి: సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఓ హేమలత సూచించారు. మండలంలోని అద్దవారిపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం గురించి తెలిసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రైతులు తమకు అవసరమైన సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా పొందవచ్చని, సమాచారం పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పౌరసమాచార అధికారిని కలిసి పొందవచ్చని తెలిపారు. అద్దవారిపల్లి, గుండ్లూరు ఆర్‌ఎస్‌కేల ఇన్‌చార్జిలు నగేష్ నాయక్, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: సమాచార హక్కు చట్టంపై అందరికి అవగాహన ఉండాలని వ్యవసాయ అధికారి రమణ కుమార్ తెలిపారు. ఎద్దులవారిపల్లె రైతుభరోసా కేంద్రంలో బుధవారం రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. సమాచార హక్కు చట్టం మేరకు కావాల్సిన సమాచారాన్ని తీసుకునే తీరుపై వివరించారు. ఏ శాఖ నుంచి అయినా రైతులు తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత పౌరసమాచార అధికారికి దరఖాస్తు చేసుకుని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు సురేష్, రెడ్డిశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపల్లె : సమాచారం హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారిణి జె. మాధవి అన్నారు. బుధవారం మండలంలోని తువ్వపల్లె రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం 2005పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సెక్షన్ 6,7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. వ్యవసాయ సహాయకులు ప్రవీణ్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబంపై ప్రభుత్వ కుట్ర

- మాజీ ఎమ్మెల్యే చింతల
- ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన



పీలేరు: నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నాయకులు



కేవీపల్లె : నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కలికిరి (వాల్మీకిపురం) ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టుపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ప్రజాదరణను ఓర్వలేక కూటమి పన్నుతోందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కక్షసాధింపుతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను నిరసిస్తూ బుధవారం పీలేరు పట్టణంలో నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీకి సంబంధం లేని లిక్కర్ కేసులో ఎంపీని ఇరికించారని తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డి ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి. సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, చంద్రారెడ్డి, చెంగల్‌రాయుడు, నాయకులు ఉదయ్‌కుమార్, స్టాంపుల మస్తాన్, అమరనాథరెడ్డి, నారే వెంకటరమణారెడ్డి, షాకీర్, కాలనీ చిన్న, విక్టరీ వెంకటరమణారెడ్డి, మునీర్, నాగభూషణం, మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి, సునీల్ రెడ్డి, వినోద్, శ్రీనాథరెడ్డి, జయపాల్‌రెడ్డి, అబీద్, దావూద్, మల్లీశ్వరి, లక్ష్మీ, నాగరాజమ్మ, సపూరా, రాజలక్ష్మీ, అరుణ, మస్తానమ్మ పాల్గొన్నారు.

కలికిరి(వాల్మీకిపురం): ప్రజలకిచ్చిన హామీల అమల్లో దారుణంగా విఫలమైన కూటమి ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని వాల్మీకిపురం వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తే ప్రజా తిరుగుబాటు తప్పదని బుధవారం హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బిడ్డల కేశవరెడ్డి, ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీం, మండల కన్వీనర్ పులి శివకుమార్‌రెడ్డి, టెలికాం అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీధర్ రాయల్, నేతలు ఆనంద, కువైట్ ఇబ్రహీం, రఘు, రవి, రాజబాబు, వెంకటస్వామి, ఆషర్, సాధిక్, చలపతి, మునిభాస్కర్, విశ్వనాథ, బబ్లు, జాకీర్, నాగార్జున, చంద్ర, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కేవీపల్లె : వైఎస్సార్‌సీపీని దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమ మద్యం కేసులో అరెస్ట్ చేశారని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గుండ్లూరి జయరామచంద్రయ్య అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తూ బుధవారం మండలంలోని గర్నిమిట్టలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, దిగువగల్ల శ్రీనివాసులురెడ్డి, సి.కె. యర్రమరెడ్డి, రామకొండారెడ్డి, రామ్‌ప్రసాద్‌నాయుడు, చిన్నయర్రమరెడ్డి, శ్రీనివాసులు, వడ్లకుంట వెంకటేష్, చామంచుల సిద్ధయ్య, అడవిపల్లె రాజన్న, సిరినాయుడు, యల్లయ్య, వేణుగోపాల్, అప్పిరెడ్డి, రామాంజులు పాల్గొన్నారు.

కలకడ : రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ. మిథున్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కొనే శక్తి లేకనే మద్యం అక్రమ కేసులో కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేసి వేధిస్తోందని వైఎస్సార్‌సీపీ పీలేరు నియోజకవర్గ మైనార్టీ శాఖ అధ్యక్షులు కె.ఎస్.మస్తాన్‌అహమ్మద్ అన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఎంపీగా హ్యాట్రిక్ సాధించిన మిథున్‌రెడ్డి బలమైన నేతగా ఎదగడం, జిల్లా రాజకీయాల్లో టీడీపీ ఉనికి కోల్పోయే పరిస్థితి రావడం జీర్ణించుకోలేక అక్రమ కేసులతో వేధిస్తోందన్నారు. ఈ కేసుల్లో ఆధారాలు లేకున్నా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అక్రమ కేసుతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని తెలిపారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

కలకడ : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకుని పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని మండలప్రత్యేక అధికారి ధయాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కె.బాటవారిపల్లె సచివాలయం పరిధిలో పీ-4పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అట్టడుగు వర్గాలను గుర్తించి వారికి విద్య, ఉపాధి, మెరుగైన జీవనోపాధే లక్ష్యంగా బంగారు కుటుంబాలను గుర్తించాలని సూచించారు. అక్కడే ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుడు వైవీ రమణ స్పందించి ప్రభుత్వం అందించే ఉచిత వస్తువులతోపాటు నిరుపేద విద్యార్థులు 10వతరగతి వరకూ అయ్యే ఖర్చులను, విద్యాసామగ్రిని సమకూర్చడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నందిని, సిచివాలయ సిబ్బంది, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: పేదలను ఆర్థికంగా, సామాజకంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మార్గదర్శి - బంగారు కుటుంబం అనే కార్యక్రమాన్ని చేపట్టిందని తహసీల్దార్ బావాజాన్, ఎంపీడీఓ కృష్ణవేణి అన్నారు. బుధవారం మండలంలోని గట్టు, నాయనబావి, మొటుకు పంచాయతీల్లో సభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న పేదరిక కుటుంబాలను గుర్తించి వారిని అత్యున్నత స్థాయిలో నిలిపేందుకు ఈ కార్యక్రమం అమలవుతున్నట్టు చెప్పారు. వ్యాపారవేత్తలు, ఎన్‌ఆర్‌ఐలు, కాంట్రాక్టర్లు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. సర్పంచులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

కలకడ : గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను మండల ప్రత్యేక అదికారి ధయాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని కలకడ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి, విశ్రాంతి గదులు, నీటి వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని రంగాల్లో బాలికలు రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల పనితీరు, విద్యాప్రమాణాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రిజిష్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బానుప్రసాద్, ఎంఈఓ మునీంద్రనాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పీలేరు రూరల్ : ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చెప్పిన హామీ మేరకు సంక్షేమ బోర్డులో కోటి రూపాయలు జమ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్, భవన నిర్మాణ కార్మికులు సతీష్‌రెడ్డి, హుస్సేన్, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ వెంకప్పకోట సర్వే నంబర్ 5/2లో కొందరు వ్యక్తులు జేసీబీతో స్థలాన్ని చదునుచేసి ఆక్రమణకు యత్నిస్తున్నారన్న స్థానికుల ఫిర్యాదుమేరకు తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ రికార్డులు పరిశీలించి, జేసీబీ చదునుచేస్తున్న స్థలం ప్రభుత్వభూమిగా నిర్ధారించుకున్నారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఆక్రమిత భూమిలో ట్రెంచ్ తవ్వించారు. భవిష్యత్తులో ఆక్రమణ జరగకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో మహేష్, సచివాలయ సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి నివాళి

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీలో వీఆర్‌ఏగా పని చేస్తున్న రాజన్న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఆర్‌ఐ హుస్సేన్, వీఆర్వో నరేంద్ర మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. పార్టీలకతీతంగా పలువురు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.